## శాస్త్రోక్తంగా లక్ష్మీనృసింహస్వామి నిత్యారాధనలు

ఊంజల్ సేవలో భాగంగా అమ్మవారికి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా సాగాయి. శుక్రవారం తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహ స్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. రాత్రి స్వామి, అమ్మవారికి తిరువారాధన, సహస్రనామార్చన, శయనోత్సవ సేవలను శాస్త్రోక్తంగా జరిపారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖాజానకు రూ.28,10,147 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

## హర్యాన గవర్నర్‌ను కలిసిన ధర్మారెడ్డిగూడెం గ్రామస్తులు


హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి మెమెంటో అందజేస్తున్న ధర్మారెడ్డిగూడెం గ్రామస్తులు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 6 : హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయను యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామస్తులు శుక్రవారం ఆ రాష్ట్ర రాజ్‌భవనలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణ విగ్రహాన్ని అందించారు. కార్యక్రమంలో వడ్డే ఉపేందర్, చీర శ్రీకాంత్, గ్యాదరి సిద్దులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని మంత్రి కోమటిరెడ్డికి ఆహ్వానం


మంత్రి వెంకట్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 6 : పట్టణంలోని భువనగిరి ఖిల్లా సమీపంలోని సీతారామంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 12న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రావాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లో వేర్వేరుగా ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు తాడూరి చంద్రయ్య, తాడెం రాజశేఖర్, కమిటీ సభ్యులు వడిచర్ల కృష్ణయాదవ్ ఉన్నారు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి గిరిప్రదక్షిణ

వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 6 : కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని రాయగిరి వేంకటేశ్వర స్వామి గుట్ట చుట్టూ భక్త భజన మండలి ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం 5:30కు రాయగిరి లక్ష్మీనరసింహస్వామి కమాన్ నుంచి భక్త భజన మండలి ఆధ్వర్యంలో గోవింద నామాలతో కీర్తనలు చేస్తూ గిరిప్రదక్షిణ చేపట్టారు. అనంతరం కొండపైన స్వయంభువుగా వెలిసిన పద్మావతీ అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామికి అభిషేకం, దూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో భక్త భజన మండలి సభ్యులు సామల శ్రీరాములు, పెద్దగాని శ్రీనివాస్, గడ్డమీది చంద్రయ్యగౌడ్, భువనగిరి ఆంజనేయులు, అంకర్ల సంజీవ, నర్ర రమేశ్ మహిళా భక్తులు పాల్గొన్నారు.

## గురుకులాల గేట్లకు తాళం వేయడం దుర్మార్గం

- బీఆర్ఎస్‌వీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేశ్

గురుకుల పాఠశాల గేటు బయట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

బీబీనగర్, డిసెంబర్ 6 : తప్పులను కప్పిపుచ్చుకోవడానికి గురుకుల పాఠశాలల గేట్లకు తాళం వేయడం సిగ్గుచేటని, ఇది దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్‌వీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను సందర్శించడానికి శుక్రవారం రాగా.. ప్రిన్సిపాల్ అనుమతించలేదు. దాంతో పాఠశాల గేటు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు, కేజీబీవీల్లో ఆహారం, తాగునీరు కల్తీతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. వాటిని పరిశీలించేందుకు వస్తే పర్మిషన్ లేదంటూ గేటుకు తాళం వేయడం ఏంటని ప్రశ్నించారు. చాలా మంది విద్యార్థులు మృతిచెందినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా గురుకులాలల్లో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు పచ్చిమట్ల వంశీగౌడ్, నాయకులు మున్నా, వేణు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## డిసెంబర్ 10న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్

మాట్లాడుతున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 6 : వికలాంగుల పింఛన్ పెంపు కోసం ఈ నెల 10న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని రాయగిరిలో శుక్రవారం నిర్వహించిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇంతవరకు పెంచకపోవడం దురదృష్టకరమన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వికలాంగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి, భువనగిరి మండలాధ్యక్షుడు కేతావత్ మురళి, నాయకులు శ్రీహరి, పోశయ్య పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ వర్ధంతి

వలిగొండ, డిసెంబర్ 6 : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని తొర్రూరు చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం ఆయన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు.

మోత్కూరు : పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వలిగొండ : అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి


మోత్కూరులో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

భువనగిరి కలెక్టరేట్ : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అట్టడుగు వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

యాదగిరిగుట్టలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పట్టణ సీఐ రమేశ్

ఆలేరు రూరల్ : కొలనుపాకలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చౌటుప్పల్ : వలిగొండ రోడ్డులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్ : తాజ్‌పూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ర్యాకల శ్రీనివాస్

భువనగిరి అర్బన్ : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీబీనగర్ : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాల సంక్షేమ సంఘం సభ్యులు

భూదాన్ పోచంపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

చౌటుప్పల్ : మార్కెట్ యార్డులో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

# మహనీయుల ఆశయాలు భావితరాలకు ఆదర్శం

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

అంబేద్కర్, పూలే విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 6 : మహనీయుల ఆశయాలు భావితరాలకు ఆదర్శప్రాయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలో దివీస్ కంపెనీ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ముక్తాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన జ్యోతిబాపూలే, బీఆర్ అంబేద్కర్, కొంగరి భాస్కర్ విగ్రహాలను ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకుందామన్నారు. దివీస్ కంపెనీ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్, కౌన్సిలర్ కొంగరి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు తడక వెంకటేశ్, మల్లేశ్ యాదవ్, భారత లవకుమార్, విగ్రహాల ప్రతిష్ఠాపన కమిటీ కన్వీనర్ కొండమడుగు రాజు, కమిటీ చైర్మన్ కొండమడుగు ఎల్లస్వామి, వైస్ చైర్మన్ దేవిగారి ధనుంజయ, నాయకులు మద్ది అంజిరెడ్డి, కొట్టం కరుణాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, బాలచంద్రం, కొండమడుగు రోషన్, నక్కల రాజిరెడ్డి, కొండమడుగు స్వామి పాల్గొన్నారు.

## మౌనిక కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో

భువనగిరి – జగదేవ్‌పూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 6 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న మౌనిక (23)కు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం భువనగిరి – జగదేవ్‌పూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన మౌనికకు చీమలకొండూరు గ్రామానికి చెందిన మహేందర్‌తో ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కుటుంబంలో నెలకొన్న కలహాలతో మౌనికను భర్త మహేందర్ బుధవారం రాత్రి చందుపట్లలోని తల్లిగారింట్లో వదిలి వెళ్లిపోయాడు. దీంతో మనస్థాపానికి గురైన మౌనిక గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పిల్లల రోదనలతో చుట్టుపక్కల వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మౌనిక మృతికి కారణమైన భర్త మహేందర్, ఆయన కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకుని మృతురాలి పిల్లలకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు, బంధువులు శుక్రవారం రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న డీసీపీ రాజేశ్‌చంద్ర వచ్చి సర్దిచెప్పడంతో రాస్తారోకోను విరమించారు.

## సమస్యలు పరిష్కరించాలని నిరసన

కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 6 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అధ్యక్షుడు మంగ పాండరి మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి మాటను నిలబెట్టుకోవాలన్నారు. తమ ఓట్లను దండుకొని తమను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో, శ్రమ దోపిడీకి గురవుతూ ఎటువంటి అలవెన్స్‌లు లేకుండా దుర్భర జీవితాలు గడుపుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఈ నెల 10నుంచి నిరవేదిక సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్‌లోని వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## పాల బిల్లులు చెల్లించాలని పాడి రైతులు ఆందోళన

పనకబండలో పాల క్యాన్లతో ఆందోళన చేస్తున్న పాడి రైతులు

మోత్కూరు, డిసెంబర్ 6 : రెండు నెలల పాల బిల్లులు చెల్లించాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పనకబండ గ్రామంలోని పాల సేకరణ కేంద్రం వద్ద రైతులు శుక్రవారం పాల క్యాన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నార్మాక్స్ నెల నెలా పాల బిల్లులు చెల్లింపులు చేసేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రెండు నెలలకోమారు కూడా ఇవ్వకపోవడం వల్ల తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమ ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వెంటనే బిల్లులు చెల్లించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లోతుకుంట మత్స్యగిరి, పాడి రైతులు లోతుకుంట అనిల్, బత్తిని మహేశ్, మత్స్యగిరి, సుదర్శన్, మల్లేశ్, నర్సింహ, జయరాములు, అంజయ్య పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ కోసం దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు, డిసెంబర్ 6 : మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట చేసేందుకు అసక్తి ఉన్న మహిళా సంఘాల సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు జనవరి 1నుంచి మధ్యాహ్న భోజనం వండి పెట్టడం కోసం అసక్తి కలిగిన వారు పాఠశాల సమయంలో వచ్చి తమను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వంట చేసినందుకు తగిన చార్జీ చెల్లించనున్నట్లు తెలిపారు.

## వివాహానికి పూర్వ విద్యార్థుల చేయూత

రాజాపేట, డిసెంబర్ 6 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 1991 – 92కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల్లో ఒకరైన శేషాద్రి కుమార్తె వివాహానికి మిగతా మిత్రలందరు కలిసి రూ. 50వేలు ఆర్థికసాయం చేశారు. కుమార్తె పెండ్లికి సాయమందించిన స్నేహితులకు శేషాద్రి కృతజ్ఞతలు తెలియజేశారు.

## విజ్ఞాన్ యూనివర్సిటీలో బి.ఫార్మసీ కోర్సు ప్రారంభం

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 6 : మండలంలోని దేశ్‌ముఖి విజ్ఞాన్ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ (బీ ఫార్మసీ) తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఫార్మాసిస్ట్‌లుగా పని చేయడానికి అవసరమైన జ్ఞానం నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. బీ ఫార్మసీ కోర్సుకు మంచి డిమాండ్ ఉందని, ఔషధ పరిశ్రమలో యువతకు విస్తృత అవకాశాలు అందిస్తుందని తెలిపారు. కోర్సు తయారీ, నాణ్యత నియంత్రణ, పరిశోధన, ఫార్మాస్యూటికల్ వ్యాపారం, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, క్లినికల్ ఫారన్మాసిస్ట్ అంశాలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.అనిల్, డిపార్ట్‌మెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని సీపీఎం నిరసన

రామన్నపేట, డిసెంబర్ 6 : పట్టణంలోని 7వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించాలని సీపీఎం నాయకులు శిలాఫలకంపై నల్లజెండాను కప్పి శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కందుల హన్మంతు, పట్టణ కార్యదర్శి మునుకుంట్ల లెనిన్ మాట్లాడుతూ 7వ వార్డులో ప్రభుత్వ దవాఖాన ప్రహరీ నుంచి దావునూరి వెంకటేశం ఇంటి వరకు రూ.5లక్షలతో మోరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ఐదు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించడం లేదన్నారు. అధికారులు స్పందించి పనులను త్వరగా పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బావండ్లపల్లి బాలరాజు, గొరిగె సోములు, గాదె నరేందర్, బావండ్లపల్లి సత్యం, వెంకట్‌రెడ్డి, అశోక్, వెంకటేశం, మల్లేశం పాల్గొన్నారు.

## గ్రూప్-2 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ హనుమంతరావు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 6 : టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరీక్ష నిర్వహణపై శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. పోలీస్, మెడికల్, హెల్త్, ఆర్టీసీ, ట్రెజరీ, విద్యా సంబంధిత అధికారులు పరీక్షల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ బాలాజి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 6 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి యోగా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దైనందిన జీవితంలో యోగా చాలా ముఖ్యమైందన్నారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే ఆరోగ్యంగా ఉండాలని, యోగాతో మానసిక పరిపక్వతతోపాటు శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయాలని సూచించారు. పాఠ్యాంశాల్లో యోగా ప్రాముఖ్యత గురించి పొందుపరచాలని పేర్కొన్నారు. యోగా వల్ల మెదడుకు ఆక్సిజన్ సంపూర్ణంగా అందుతుందని, ఒత్తిడిని తగ్గించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్ఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా యూత్ వెల్ఫేర్ అధికారి ధనుంజనేయులు, యోగా శిక్షకుడు శివ పాల్గొన్నారు.

## సర్వే నమోదును పారదర్శకంగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ గంగాధర్

రామన్నపేటలో ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

రామన్నపేట, డిసెంబర్ 6 : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేను ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో చేపడుతున్న సర్వే డేటా ఎంట్రీని పరిశీలించారు. సర్వేలో చిన్న, చిన్న పొరపాట్లు జరిగితే సవరించాలన్నారు. ఇంకా వివరాలు అందించని, డోర్‌లాక్ ఉన్న కుటుంబాలను గుర్తించి కుటుంబ వివరాల నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట డీఆర్‌పీ శ్రీనివాస్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, ఎంపీఓ రవూఫ్ అలీ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## డీఏపీకి ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలి : ఏడీఏ

రైతు వేదికలో మాట్లాడుతున్న ఏడీఏ శాంతినిర్మల

యాదగిరిగుట్ట, డిసెంబర్ 6 : రానున్న యాసంగిలో డీఏపీకి బదులుగా ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలని ఏడీఏ శాంతి నిర్మల అన్నారు. మండలంలోని మాసాయిపేట గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం ఆమె డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వరి, మొక్కజొన్న, ఇతర ఆరుతడి పంటల్లో అవసరమయ్యే డీఏపీకి బదులుగా పీఎస్బీ బ్యాక్టిరియా, ఆర్గానిక్, కాంప్లెక్స్ ఎరువులు, నానో డీఏపీ, సింగిల్ సూపర్ ఫాస్పెట్‌ను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు, డీలర్లు పాల్గొన్నారు.

## 5ఏండ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి : సీడీపీఓ

అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు యూనిఫామ్ అందజేస్తున్న సీడీపీఓ జ్యోత్స్న

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 6 : 5 ఏండ్ల లోపు పిల్లలందరినీ స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సీడీపీఓ జ్యోత్స్న అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంగన్‌వాడీ చిన్నారులకు ప్రభుత్వ యూనిఫామ్‌ను శుక్రవారం ఆమె అందించి మాట్లాడారు. చిన్న పిల్లల కోసం పేస్కూల్ మాదిరిగా ప్రతి కేంద్రానికి ఆట వస్తువులు అందించినట్లు పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాణిశ్రీ, టీచర్లు ధనమ్మ, అండాలు, కల్పన, నాగమణి, ఆయాలు పాల్గొన్నారు.